క్లుప్తంగా

2 బైక్‌లు ఢీ: ఇద్దరికి గాయాలు



వీపనగండ్ల: మండలంలోని గోవర్ధనగిరి సమీపంలో రెండు బైక్‌లు ఢీకొని ఇద్దరికి గాయాలయిన ఘటనలో మంగళవారం చోటుచేసుకుంది. బైక్‌లపై ప్రయాణిస్తున్న గోవర్ధనగిని గ్రామానికి చెందిన రాముడు, పెద్దదగడ గ్రామానికి చెందిన నర్సింహులు గోవర్ధనగిరి సమీపంలో ఉన్న బ్రిడ్జిపై ఢీకొనడంతో వారికి గాయాలయ్యాయి. ఘటన స్థలాన్ని పరిశీలించిన ఎస్‌ఐ రాణి క్షతగాత్రులను ఆస్పత్రికి పంపించారు.

ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన పూజలు



అమరచింత: మండలంలోని మిట్టనందిమళ్ల గ్రామంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహాపూజ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. మంగళవారం తెల్లవారుజాము నుంచి పాటిమీది ఆంజనేయస్వామి ఆలయంలో వేదపండితుల సమక్షంలో హోమాలు నిర్వహించారు. బుధవారం దేవతామూర్తుల విగ్రహాలను జలాధివాసం, ధాన్యధివాసం కార్యక్రమాలు చేపట్టనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గురువారం ధ్వజస్తంభం ప్రతిష్ఠ కార్యక్రమం వైభవంగా నిర్వహిస్తామన్నారు. పూజల్లో పాల్గొనే భక్తులందరికీ అన్నప్రసాద వితరణ చేపడుతున్నట్లు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



వనపర్తి రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని, తల్లిదండ్రులు తమ పిల్లలను సర్కార్ బడుల్లో చేర్పించాలని హెచ్‌ఎం సునీల్‌కుమార్ సూచించారు. మంగళవారం మండలంలోని మెంటిపల్లిలో ప్రభుత్వ ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమం నిర్వహించి, 'ప్రభుత్వ బడులు ముద్దు.. ప్రైవేట్ బడులు వద్దు' అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత పుస్తకాలు, యూనిఫాం, మధ్యాహ్న భోజనంతో పాటు నాణ్యమైన విద్య లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గీత, గ్రామస్తులు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు



పాన్‌గల్: మండలంలోని కేతేపల్లి, చిక్కేపల్లి, కదిరెపాడు గ్రామాల్లో మండల పశువైద్య శాఖ ఆధ్వర్యంలో మంగళవారం పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేసినట్లు మండల పశువైద్యాధికారి డా.సురేష్ తెలిపారు. రైతులు అందుబాటులో ఉంటూ పశువులకు టీకాలు వేయించుకోవాలని కోరారు. టీకాలు వేయించడం ద్వారా పశువుల్లో రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. ఆయా గ్రామాల్లో వ్యాధి నిరోధక టీకాల పనితీరు పరీక్షల నిమిత్తం ఆవులు, గేదెల నుంచి రక్త నమూనాలను సేకరించినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో డా.కరుణశ్రీ, శిక్షణ వైద్యులు డా.అనూష, డా.కళ్యాణి, పశువైద్య సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పరిశుభ్రతలో ప్రజల పాత్ర కీలకం



వనపర్తి టౌన్: పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు పారిశుద్ధ్య కార్మికులు పని చేస్తున్నారని, అదే విధంగా ప్రజల పాత్ర అవసరమని మున్సిపల్ కమిషనర్ ఎన్. వెంకటేశ్వర్లు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని పురపాలక సంఘాల్లో అమలు చేసిన 100 రోజుల కార్యచరణలో భాగంగా మంగళవారం జిల్లా కేంద్రంలోని 9వ వార్డు సూర్యచంద్ర స్కూల్ రోడ్డు, 5వ వార్డులోని ఇందిరాకాలనీ, 31వ వార్డు కేడీఆర్ నగర్‌లోని డ్రెయినేజీల్లో మురుగును తీయించారు. కమిషనర్ వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉమా మహేశ్వర్‌రెడ్డి ఉన్నారు.

విత్తనాల ఎంపిక కీలకం

- దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి
- ప్రైవేట్ వ్యక్తులను ఆశ్రయించొద్దు



మదనాపురంలో విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

మదనాపురం: వానాకాలం సీజన్ ప్రారంభమవుతున్న తరుణంలో రైతులు విత్తనాల ఎంపికలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మదనాపురం, కొత్తకోట ఉమ్మడి మండలాల రైతులకు ప్రొఫెసర్ జయశంకర్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో స్థానిక రైతువేదికలో ఉచిత విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం ప్రజా ప్రభుత్వం పనిచేస్తుందని, అందులో భాగంగా నాణ్యమైన ఉచిత విత్తనాలను పంపిణీ చేస్తున్నామన్నారు. పదేళ్ల బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో రైతు సంక్షేమాన్ని మరిచారని విమర్శించారు. ప్రొఫెసర్ జయశంకర్ యూనివర్సిటీ శాస్త్రవేత్త గీత ఆమ్రపాలి మాట్లాడుతూ నాణ్యమైన విత్తనాలు ఎంపికతోనే రైతులు అధిక దిగుబడులు సాధించొచ్చని సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పల్లెపాగ ప్రశాంత్, వైస్ చైర్మన్ తిరుపతిరెడ్డి, తహసీల్దార్ జేకే మోహన్, ఏఓ గాయత్రి, కృష్ణారెడ్డి, శేఖర్‌రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నాగన్న, జగదీష్, వడ్డె కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

కొత్త వంగడాలపై దృష్టి

అమరచింత: రైతులు కొత్తరకం వంగడాలపై దృష్టి సారించి అధిక దిగుబడి సాధించే విధంగా పంట సాగు చేసుకోవాలని ఏడీఏ దామోదర్ అన్నారు. మండలంలోని నాగల్‌కడ్మూర్ రైతువేదికలో మంగళవారం రైతునేస్తం కార్యక్రమం నిర్వహించి రైతులకు ఉచితంగా విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు నాణ్యమైన మేలు రకం వరి విత్తనాలు 10 కేజీల పాకెట్, జొన్న విత్తనాలు 5 కేజీల పాకెట్‌ను రైతులకు అందించారు. కార్యక్రమంలో ఏఓ అరవింద్, ఏఈఓ శివ రైతులు పాల్గొన్నారు.



గోపాల్‌పేటలో..



నాగర్‌కడ్మూర్‌లో రైతులకు విత్తనాలు అందిస్తున్న ఏడీఏ దామోదర్

గోపాల్‌పేట: రైతులు ప్రతి పంటలో నాణ్యమైన విత్తనాలు వాడినప్పుడు దిగుబడి పెరుగుతుందని పాలెం శాస్త్రవేత్తలు శ్రీధర్, విజయలక్ష్మి అన్నారు. మంగళవారం వారు గోపాల్‌పేట, ఏదుల మండలాల్లో 'నాణ్యమైన విత్తనం రైతన్నకు నేస్తం' అనే పథకంలో ఎంపిక చేసిన ముగ్గురు రైతులకు విత్తనాలను ఉచితంగా అందించారు. కార్యక్రమంలో ఏఓ కరుణశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

ఖిల్లాఘనపురం: రైతులు నాణ్యమైన విత్తనాలు విత్తుకొని అధిక దిగుబడి సాధించాలని పాలెం వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త శ్రీధర్, మండల వ్యవసాయ అధికారి మల్లయ్య అన్నారు. మంగళవారం మండలంలోని పర్వతాపురం రైతువేదికలో రైతు నేస్తం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 60 మంది రైతులకు 40 యూనిట్లు వరి, 20 యూనిట్లు జొన్న విత్తనాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సింగల్‌విండో చైర్మన్ మురళీధర్‌రెడ్డి, ఏఈఓ, రైతులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి



మాట్లాడుతున్న రామ్మోహన్

పాన్‌గల్: ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్య సేవలు అందించాలని మంత్రి జూపల్లి నియోజకవర్గ క్యాంపు ఆఫీస్ అధికారులు రామ్మోహన్, కిశోర్‌కుమార్ వైద్య సిబ్బందికి సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో వైద్య సిబ్బందితో అధికారులు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంత్రి ఆదేశాలతో పీహెచ్‌సీలో అవసరమయ్యే వసతులు, సిబ్బంది నియామకం, సమస్యల పరిష్కారంపై సిబ్బందితో ఆరా తీశారు. ఆయా సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కారిస్తామని తెలిపారు. పీహెచ్‌సీలో కాన్పుల సంఖ్య పెంచడం, చిన్నారులకు సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు వేయించడం, బాల్య వివాహాలను నిరోధించడం వంటి అంశాలపై సిబ్బంది, ఆశాలు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సమావేశంలో పీహెచ్‌సీ వైద్యులు డా.చంద్రశేఖర్, సీహెచ్‌ఓ రామయ్య, సిబ్బంది, ఆశలు పాల్గొన్నారు.

అక్రమంగా ఇంటి నిర్మాణం చేస్తే చర్యలు



ఇంటి యాజమానితో మాట్లాడుతున్న కమిషనర్ రవిబాబు

అమరచింత: పట్టణంలో ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడితే చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ రవిబాబు అన్నారు. పట్టణంలోని రాంనగర్‌లో మురుగు కాల్వను ధ్వంసం చేసి ఇంటి నిర్మాణ పనులు చేస్తున్న వ్యక్తికి మున్సిపాలిటీ ద్వారా నోటీసులు అందించినా.. నిర్మాణ పనులు ఆపకపోవడం ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం అక్రమంగా చేపడుతున్న ఇంటి నిర్మాణ పనులను సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఈ విషయంలో సదరు ఇంటి యాజమానిని పిలిపించి నోటీసులు ఇచ్చి, డ్రెయినేజీని ధ్వంసం చేసి మధ్యలో పిల్లర్లు ఎందుకు వేస్తున్నారని ప్రశ్నిస్తే.. సదరు ఇంటి యజమాని ఎమ్మెల్యే పీఏ వెంకటేష్ ద్వారా ఫోన్ చేయించి దబాయిస్తున్నాడని కమిషనర్ తెలిపారు. అక్రమ నిర్మాణం ఆపాలని సూచిస్తే ఫోన్లు చేసి బెదిరిస్తే సరిపోదని, మురుగుకాల్వలో వేసిన పిల్లర్లు తొలగించకపోతే మున్సిపల్ పరిధిలో చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అసంపూర్తి రోడ్డుతో వాహనదారులకు ఇక్కట్లు



రోడ్డుపై ఇరుక్కుపోయిన డీజీఎం కారు

పాన్‌గల్: మండలంలోని వెంగళాయిపల్లి సమీపంలో అసంపూర్తి రోడ్డుతో ప్రతి నిత్యం వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వనపర్తి–కొల్లాపూర్ ప్రధాన రోడ్డుపై గ్రామంలో సీసీ రోడ్డు ఒక పక్క వేసి మరో పక్క వదిలేయడంతో రాకపోకలు సాగించే వాహనదారులు ప్రతి నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మంగళవారం గ్రామంలోని వరి కొనుగోలు కేంద్రం సందర్శనకు వచ్చిన పౌరసరఫరాల ప్రిన్సిపల్ సెక్రెటరీ డీఎస్ చౌహాన్ వెంట వచ్చిన పౌరసరఫరాల డీజీఎం అభిషేక్ కారు గ్రామ సమీపంలో అసంపూర్తి సీసీ రోడ్డుపై ఇరుక్కుపోవడంతో అతడి కారు వదిలి ద్విచక్రవాహనంపై వేరే గ్రామానికి వెళ్లాల్సి వచ్చింది. సిబ్బంది కారును పైకి తీశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అసంపూర్తి సీసీ రోడ్డును పూర్తి చేసి ఇబ్బందులు తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.

పెండింగ్ వేతనాలు విడుదల చేయాలి

మదనాపురం: చాలీచాలని వేతనాలతో సతమతమవుతున్న పారిశుద్ధ్య కార్మికులకు పెండింగ్‌లో ఉన్న మూడు నెలల వేతనాలను విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బొబ్బిలి నిక్సన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఎంపీడీఓ ప్రసన్నకుమారికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు ఒకటో తేదీన వేతనాలు అందిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి జీపీ కార్మికులు గుర్తుకు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్కరోజు కార్మికులు పారిశుద్ధ్య పనులు నిలిపివేస్తే ప్రజలందరూ ఇబ్బందులు ఎదుర్కొంటారని, అలాంటి వారిని ఇబ్బందులకు గురిచేయొద్దన్నారు. కార్మికులకు నెలకు కనీస వేతనం రూ.18 వేలు ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్‌ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పారిశుద్ధ్య కార్మికులు శ్రీనివాసులు, ఖాదర్, అశోక్, బక్క శ్రీను, ఊసన్నయ్య పాల్గొన్నారు.

సజావుగా ధాన్యం కొనుగోలు



తెల్లరాళ్లపల్లిలో ధాన్యంలో తేమశాతాన్ని పరిశీలిస్తున్న ప్రధానకార్యదర్శి డీఎస్ చౌహాన్

- బ్లాక్ లిస్ట్‌లో ఉన్న మిల్లులకు ధాన్యం కేటాయించలేదు
- పౌరసరఫరాలశాఖ ప్రధాన కార్యదర్శి డీఎస్ చౌహాన్

పాన్‌గల్: కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు చేస్తామని.. ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పౌరసరఫరాలశాఖ ప్రధాన కార్యదర్శి డీఎస్ చౌహాన్ అన్నారు. మంగళవారం మండలంలోని వెంగళాయిపల్లి, తెల్లరాళ్లపల్లిలోని వరి కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ ఆదర్శ్ సురభితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రానికి ధాన్యం వచ్చిన తర్వాత పూర్తి బాధ్యత నిర్వాహకులదేనన్నారు. తెలంగాణ చరిత్రలో తొలిసారి నాణ్యమైన ధాన్యం సేకరణకు అత్యాధునిక యంత్రాలను వినియోగిస్తున్నట్లు చెప్పారు. ఈ యంత్రాలతో చెత్తా, తాలు, మట్టి వేరవుతాయని ప్రత్యక్షంగా చూపించారు. నాణ్యమైన ధాన్యం మిల్లర్లకు అందించిన తర్వాత తరుగు తీస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. తరుగు తీస్తే నేరుగా జిల్లా, రాష్ట్ర అధికారులకు ఫిర్యాదు చేయాలని రైతులకు సూచించారు. బ్లాక్ లిస్టులో ఉన్న మిల్లులకు ఎట్టి పరిస్థితుల్లో ధాన్యం కేటాయించేది లేదని.. సీఎంఆర్ రెగ్యులర్‌గా అప్పగించే మిల్లులకు ప్రాధాన్యం ఇస్తామన్నారు. మిల్లర్లతో మరోమారు సమావేశం నిర్వహించి రైతుల సమస్యలను వారికి వివరించి ఇబ్బందులకు గురిచేయొద్దని ఆదేశిస్తామని చెప్పారు. ఈ ఏడాది గతంలో కన్నా ధాన్యం దిగుబడి పెరిగిందన్నారు. ఆయన వెంట రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి కాశీ విశ్వనాథ్, పౌరసరఫరాలశాఖ డీఎం జగన్మోహన్, డీఆర్డీఓ ఉమాదేవి, ఏఓ రాజవర్ధన్‌రెడ్డి, ఏపీఎం వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పొలంలో కడీలు ధ్వంసం: 8 మందిపై కేసు నమోదు

పాన్‌గల్: అక్రమంగా పొలంలోకి ప్రవేశించి కడీలు ధ్వంసం చేసిన ఘటనలో 8 మందిపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని దావాజిపల్లితండాకు చెందిన ముడావత్ భూపతినాయక్‌తో పాటు వారి సోదరులకు గ్రామ శివారులో సర్వేనంబర్ 43 లో 16 ఎకరాల భూమి ఉంది. ఈ సర్వే నంబర్‌లోని 3.32 ఎకరాల భూమి తండాకు చెందిన ముడావత్ సోమ్లానాయక్ వారసులపై అనుకోకుండా పట్టా అయింది. ఈ విషయంలో కోర్టును ఆశ్రయించగా కోర్టు ముడావత్ భూపతి నాయక్‌కు అనుకూలంగా తీర్పు వచ్చింది. దీంతో గత నెల 28న రవినాయక్, తులసి, కోక్య, సుజాత, నారాయణ, మన్యం, సక్కిలు, పార్వతి అనే 8 మంది అక్రమంగా ఆ పొలంలోకి ప్రవేశించి కడీలను ధ్వంసం చేసి బూతులు తిడుతూ తమపై దాడి చేసేందుకు ప్రయత్నించారని మంగళవారం ముడావత్ భూపతినాయక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు 8 మందిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలి

పాన్‌గల్: పంటల సాగులో శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారుల సూచనలు తప్పక పాటించాలని కృషి విజ్ఞాన కేంద్రం ఉద్యాన వన శాస్త్రవేత్త సురేష్‌కుమార్, భారత వ్యవసాయ పరిశోధన మండలి నూనె గింజల పరిశోధన శాస్త్రవేత్త డా.ఆర్‌డీ ప్రసాద్ అన్నారు. వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని తెల్లరాళ్లపల్లి గ్రామంలో వానకాలం పంటల సాగులో తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతులు, ప్రభుత్వ సబ్సిడీలపై రైతులకు అవగాహన కల్పించారు. పచ్చిరొట్టె పంటలైన జీలుగ, జనుము సాగు చేసి, పూత దశలో పొలంలో కలియ దున్నడంతో భూసారం పెరుగుతుందని, మామిడి, వరి, ఆముదం, వేరుశనగ పంటల సాగులో మెళకువలు వివరించారు. పామాయిల్ పంటల సాగులో యాజమాన్య పద్ధతులు, ప్రభుత్వ రాయితీల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఓ రాజవర్ధన్‌రెడ్డి, ఉద్యాన వన శాఖ అధికారి కృష్ణ, ఏఈఓ షర్మిళాదేవి, రైతులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ప్రతిష్ఠాపనోత్సవాలు



పోతురాజులతో ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి



విగ్రహాల ఊరేగింపులో పాల్గొన్న భక్తులు



ఊరేగింపులో పాల్గొన్న సీతాదయాకర్‌రెడ్డి



కళాకారుల విన్యాసం

ఆత్మకూర్: పట్టణంలో నూతనంగా నిర్మించిన పోశమ్మ, కర్రెమ్మ, లింగమయ్య, కోటమైసమ్మ, కట్టమైసమ్మ, భూలక్ష్మమ్మ, బొడ్రాళ్ల ప్రతిష్ఠా మహోత్సవంలో భాగంగా మంగళవారం ఉదయం నుంచి రాత్రిదాక నిర్వహించిన ప్రత్యేక పూజల్లో మక్తల్ ఎమ్మెల్యే డాక్టర్ వాకిటి శ్రీహరి, బాలల హక్కుల పరిరక్షణ చైర్‌పర్సన్ సీతదయాకర్‌రెడ్డి, రాష్ట్ర గీతకార్మిక డిపార్ట్‌మెంట్ చైర్మన్ నాగరాజుగౌడ్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం గోపూజ, గణపతి పూజ, పుణ్యవాహచనం, ఆచార్యదిరుత్విక్‌వరుణ, పంచగవ్యమేళన, ప్రాశన, ప్రోక్షన యాగశాల ప్రవేశం, ప్రధాన దేవత, నవగ్రహ వాస్తు భద్ర మండలదేవత ఆరాధన, మంత్రమూర్తి అభిశేఖము, మంగళహారతి, తీర్థప్రసాద వితరణ చేపట్టారు.

గ్రామదేవతల ఊరేగింపు

హరిహరపుత్ర అయ్యప్పస్వామి ఆలయం నుంచి పోశమ్మ, కర్రెమ్మ, లింగమయ్య, కోటమైసమ్మ, కట్టమైసమ్మ, భూలక్ష్మమ్మ, బొడ్రాళ్ల ఉత్సవ మూర్తుల విగ్రహాల ఊరేగింపు మహోత్సవం కనులపండువగా కొనసాగింది. పోతురాజుల విన్యాసాలు, దేవతమూర్తుల వేషధారణలో విన్యాసాలు, చిన్నారుల కోలాటం విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మొగిలి శ్రీధర్‌గౌడ్, గంగాధర్‌గౌడ్, రవికుమార్, రహ్మతుల్లా, తులసీరాజ్, పరమేష్, శ్రీను, నిర్వాహకులు అశ్విన్‌కుమార్, ఎస్టీడీ శ్రీను, ఆనంద్, కొండాపురం రాము, మణివర్ధన్‌రెడ్డి, శివానంద్, రమాకాంత్, నాగేష్, వెంకటేష్, యాదగిరిశెట్టి, బాలకృష్ణ, రఘు, సూరి, అశోక్, కృష్ణయ్య, రవీందర్, రాము, సాయిరాఫ

రెవెన్యూ సదస్సులతో రైతులకు ప్రయోజనం



మూలమళ్లలో మాట్లాడుతున్న తహసీల్దార్ చాంద్‌పాషా

సాక్షి, నెట్‌వర్క్: రెవెన్యూ సదస్సులతో రైతులకు సంబంధించి దీర్ఘకాలికంగా ఉన్న భూ సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని రెవెన్యూ అధికారులు తెలిపారు. మంగళవారం జిల్లావ్యాప్తంగా ఎంపిక చేసిన గ్రామాల్లో అధికారుల రెవెన్యూ సదస్సులు నిర్వహించారు.

- వనపర్తి మండలంలోని అచ్యుతాపురంలో తహసీల్దార్ రమేష్‌రెడ్డి ఆధ్వర్యంలో 32 దరఖాస్తులు, అంజనగిరిలో డిప్యూటీ తహసీల్దార్ చక్రపాణి పాల్గొని 18 దరఖాస్తులు స్వీకరించారు.
- పెబ్బేరు మండలంలోని అయ్యవారిపల్లిలో తహసీల్దార్ మురళీగౌడ్ ఆధ్వర్యంలో 29, జనుంపల్లిలో డిప్యూటీ తహసీల్దార్ శ్యాం 14 దరఖాస్తులు తీసుకున్నారు.
- శ్రీరంగాపురం మండలంలోని జానంపేటలో తహసీల్దార్ రాజు రైతుల నుంచి 5 దరఖాస్తులు స్వీకరించారు.
- ఆత్మకూర్ మండలంలోని మూలమళ్లలో 11, ఖానాపూర్ ఆరు దరఖాస్తులు వచ్చాయని తహసీల్దార్ షేక్ చాంద్‌పాష తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌ఐ చంద్రశేఖర్, సర్వేయర్ సురేష్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.
- అమరచింత మండలంలోని సింగంపేట, కిష్టంపల్లి గ్రామాల్లో తహసీల్దార్ రవికుమార్ యాదవ్ ఆధ్వర్యంలో సదస్సులు నిర్వహించగా.. 17 దరఖాస్తులు వచ్చాయి. కార్యక్రమంలో డీటీ రెడ్యానాయక్, ఆర్‌ఐలు వెంకటయ్య, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.
- వీపనగండ్ల మండలంలోని సంపత్‌రావుపల్లిలో 48 మంది రైతులు దరఖాస్తులు అందజేసినట్లు తహసీల్దార్ వరలక్ష్మి తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ కృష్ణమూర్తి, ఆర్‌ఐ కురుమూర్తి, సర్వేయర్ శివ, గ్రామస్తులు పాల్గొన్నారు.
- ఖిల్లాఘనపురం మండలంలోని అల్లమాయపల్లిలో 20, తిర్మలాయపల్లి 8 దరఖాస్తులు స్వీకరించినట్లు తహసీల్దార్ సుగుణ తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మీకాంత్, సీనియర్ అసిస్టెంట్ కురుమూర్తి, ఆర్‌ఐ తిరుపతయ్య, సిబ్బంది పాల్గొన్నారు.
- ఏదుల మండలంలోని చీర్కపల్లిలో 23 దరఖాస్తులు వచ్చాయని తహసీల్దార్ మల్లికార్జున్ తెలిపారు. రేవల్లి మండలంలోని కేశంపేటలో 50 దరఖాస్తులు వచ్చాయని తహసీల్దార్ లక్ష్మీదేవి తెలిపారు.



కేశంపేటలో..



సింగంపేటలో..



అల్లమాయపల్లిలో..



సంపత్రావ్‌పల్లిలో..



అచ్యుతాపురంలో..



జానంపేటలో..

వ్యాపారంలో తిరుగులేని శక్తిగా 'భారతి సిమెంట్'

గోపాల్‌పేట: సిమెంట్ వ్యాపారంలో తిరుగులేని సంస్థగా ఎదుగుతున్న వికాట్ గ్రూపునకు చెందిన భారతి సిమెంట్ అల్ట్రాఫాస్ట్ పేరుతో ఫాస్ట్ సెట్టింగ్ సిమెంట్‌ను తెలంగాణలో విడుదల చేసిందని వికాట్ గ్రూప్ టెక్నికల్ ఆఫీసర్ నితిన్ అన్నారు. మంగళవారం ఆయన మండల కేంద్రంలోని గణేష్ ట్రేడర్స్ వద్ద మేస్త్రీలకు అవగాహన కల్పించారు. మార్కెట్‌లో లభించే సిమెంట్‌తో పోలిస్తే భారతి సిమెంట్ నిర్మాణ ప్రక్రియ వేగంగా ఉంటుందన్నారు. భారతి సిమెంట్‌తో వేసిన స్లాబులు, పిల్లర్లు, బ్రిడ్జిలు, రహదారులు ధృడంగా ఉంటాయని తెలిపారు. భారతి సిమెంట్ ఇంజినీర్లు సైట్ వద్దకు వచ్చి నిర్మాణ పనులను పర్యవేక్షిస్తారని పేర్కొన్నారు. అనంతరం మేస్త్రీలకు రూ.లక్ష ప్రమాదబీమా చేసి, పత్రాలను అందించారు. ఆయనతో పాటు మార్కెటింగ్ ఆఫీసర్ భరత్‌కుమార్, డీలర్ బాలరాజు, తాపీమేస్త్రీలు పాల్గొన్నారు.

నిమ్న వర్గాలకు అన్యాయం

గోపాల్‌పేట: రాష్ట్ర ఏర్పాటు కోసం జరిగిన ఉద్యమంలో అమరులైంది 99శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీలకు చెందిన వారేనని, ప్రస్తుతం తెలంగాణ వచ్చాక అగ్రకులాలు రాజ్యం ఏలుతున్నారని బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ మండల అధ్యక్షుడు గంధం నాగరాజు, ధర్మసమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ అన్నారు. మంగళవారం వారు మండల కేంద్రంలోని అమరవీరుల స్తూపం వద్ద అమరుల త్యాగాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఎల్లయ్య, మణ్యం, కురుమన్న, సుధాకర్, ఈశ్వర్, కిరణ్, రాములు, సహదేవుడు తదితరులు పాల్గొన్నారు.